# కుత్తిగంటు

**• పెంట బాబూరావు •**

## ''దండాలు దొరా!'' అన్న మాటలు విని, టీచింగ్ నోట్సు రాసుకుంటున్న నేను తలెత్తి చూశాను. ఎదురుగా.... సింగడు, వరాలు నిల్చున్నాడు.

''ఏమ్రా! బాగున్నారా?'' అడిగాన్నేను.

''బాగున్నాం దొరా! మా కూనను తీసు కొచ్చాం దొరా! పెద్ద మనసుగలోడివి. దీవించుదొరా!'' అన్నాడు సింగడు.

అప్పుడు చూశాను వరాలు చేతుల్లో ఉన్న మూడు నెలల పిల్లవాడ్ని. అనుకోకుండా నా పెదవులపై చిరునవ్వు వెలసింది. ఇరవై రూపాయల నోటు తీసి సింగడి చేతిలో పెట్టి పిల్లాడికి బట్టలు కొనమన్నాను. పిల్లాడిమీద చెయ్యివేసి ఆశీర్వదిస్తూ అప్రయత్నంగా చూశాను వరాలు మెడబోసిగా ఉండటం.

''వరాలూ నీ 'కుత్తిగంటు' ఏది?'' అడిగాన్నేను.

సింగడు, వరాలు ఒకరి ముఖంలోకి ఒకరు చూసుకున్నారు. ఫక్కున నవ్వారు.

అయోమయంగా చూశాను ఇద్దరివైపు.

''గొలుసుగా వేసి పిల్లగాడికి వేశాం'' అంటూ పిల్లగాడి మెడలో నున్న సన్నటి చిన్న గొలుసు చూపించాడు సింగడు.

''అదేం!'' అడిగాన్నేను.

''దానీ మీద మోజు తీరిపోనాది దొరా!'' అన్నది వరాలు తలొంచుకొని.

''మంచి పని చేశారు'' అన్నాన్నేను నవ్వుతూ.

''ఎల్తాదొరా!'' అన్నాడు సింగడు, వరాలు ఏకకంఠంతో.

''మంచిది, సుఖశాంతులతో వర్ధిల్లండి'' చేతులెత్తి దీవించాను మనస్ఫూర్తిగా.

సింగడు, వరాలు వెనుదిరిగారు.

వారువెళ్ళిపోతున్నా, వారి గురించి ఆలోచనలు నన్ను వదల్లేదు. జరిగిపోయిన సంఘటనలు ఒక్కొక్కటే గుర్తుకు రాసాగాయి.

★★★★

సోషల్ వెల్ఫేర్ వారి ఆధ్వర్యంలో పనిచేసే పాఠశాలల్లో టీచర్‌గా ఎపాయింట్ అయిన దగ్గర్నుంచి, గిరిజన ప్రాంతాలలోనే పనిచెయ్యడం అలవాటు అయిపోయింది నాకు. అలా తిరుగుతూ మూడు సంవత్సరాల క్రిందటే ఈ ఊరు అంటె 'మొండెఖల్లు' చేరుకున్నాను. ఇక్కడకు చుట్టు ప్రక్కల నున్న గూడాల నుంచి పిల్లలు చదువుకునేందుకు వస్తారు. అలా ఉన్న గూడాలలో దగ్గరగా ఉన్నదే 'గాలిగూడ'. ఈ 'గూడ' కి సంబంధించినవారే సింగడు, వరాలు.

పిల్లల చదువుకోసం పట్నంలో కుటుంబాన్నుంచి, నేనిక్కడ ఉంటున్నాను. తన ఖాళీ సమయంలో వస్తూ, నా అవసరాలు చూస్తుంటాడు సింగడుఅలా మా మధ్య పరిచయం పెరిగింది. అలా నాపై నమ్మకం కుదిరాక తన స్వవిషయాలు కూడా చెప్పడం మొదలెట్టాడు సింగడు. అలా నాకు తెలిసిందే సింగడు, వరాల ప్రేమాయణం, పెళ్ళి.

★★★★

'ఢమ, ఢమ, ఢమ, ఢమ' డప్పులు మ్రోగుతున్నాయి.

సుమారు 'అరవై' 'గూడా'లున్న గిరిజన గ్రామం అది. దాని పేరు 'గారిగూడ'.

అందులో శరభయ్య' గూడ ఎదురుగా పెద్ద నెగడు మండుతోంది. నెగడుకు ఒక ప్రక్కగా 'గూడ' పెద్దలందరూ సమావేశమయ్యారు. వారి దృష్టి అంతా ఎప్పుడు కార్యక్రమం ముగుస్తుందా! ఎప్పుడు ఇప్పసారా తాగుదామా అని ఎదురు

**కథల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించబడిన కథ**

చూస్తున్నారు.

మళ్ళీ 'ఢమ, ఢమ, ఢమ, ఢమ' డప్పుల మోత.

అది మామూలు మోత కాదు. కారణం శరభయ్య కూతురు 'వరాలు' 'మనువు' సంబరం. 'గూడ'లో పోరగాళ్ళందరూ వరాల్ని మనువాడ్డానికి పోటీపడుతున్నారు. ఎందుకంటే 'వరాలు' వాలా అందమైనదే కాక వాలా మరుకైనది కూడా. అందుకే అది మామూలు మోత కాదు. పోరగాళ్ళ గుండెల్లో మ్రోగుతున్న మోత.

ఆ పోరగాళ్ళలో 'సింగడు' కూడా ఒకడు. అతని మనసు పరిపరి విధాల పోతోంది. వరాలు

◆ ◆ ◆

**అతని చేతిని ముద్దుపెట్టుకుంది వరాలు.**

◆ ◆ ◆


తనంటే ఇష్టపడుతోంది. కాని ఒక సమస్య వచ్చింది. నాలుగు రోజుల క్రితం వరాలు తనను తలకు మించిన కోరిక కోరింది. అదే 'కుత్తిగంటు' వేయించాల. 'కుత్తిగంటు' వేయించాలంటే మాటలా. తను రోజల్లా కష్టపడి సేకరించిన, పుట్టతేనె, కుంకుళ్ళు, చింతపండు అమ్మితే వచ్చే సొమ్ము తల్లి, తండ్రి, తమ్ముడు, తను తినడానికే సరిపోతోంది. అందుకె మనువయ్యాక వేయిస్తానన్నాడు. అనుమానంగా చూస్తూ వెళ్ళిపోయింది. 'వరాలుకొంపదీసి మనువు సంబరంలో భుజం మీద చెయ్యి తోసెయ్యదు కదా? గుండె దడ, దడలాడింది. వరాలు లేకపోతే తను బతగ్గలడా! ఇక్కడ సింగడు ఇలా ఆలోచిస్తుంటే......

★★★★

అక్కడ పెళ్ళి ముస్తాబవుతున్న వరాలు మనసు మరోలా ఆలోచిస్తోంది. పోరగాళ్ళందరిలో 'సింగడు' తనకు నచ్చాడు. కాని 'సింగడిని' చేసుకుంటే తన కోరిక తీరుతుందా? లేదా? అన్నదే ఆమెను వేధిస్తున్న సమస్య. మొత్తం గూడలో నలుగురే కుత్తిగంటు వేయించుకున్నారు. తను కూడా వేయించుకుంటే తమ వాళ్ళందరిలో ఎంతో గొప్పగుంటుంది. మిగతా పోరగాళ్ళలో కూడా తన కోరిక తీర్చగలిగినోళ్ళు ఇద్దరు, ముగ్గురున్నారు. కాని సింగడి వైపు మనసు లాగుతోంది. ఏం చెయ్యాల. 'కుత్తిగంటా' లేక 'సింగడా'? ఆలోచించి చివరికి ఒక నిర్ణయానికొచ్చింది వరాలు.

★★★★

అకస్మాత్తుగా డప్పుల చప్పుడు ఆగింది.



పోరగాళ్ళందరూ ఆతృతగా ఎదురు చూడసాగారు.

వరాల్ని 'నెగడు' దగ్గరకి తీసుకు వచ్చి కూర్చోబెట్టారు.

గ్రామ పెద్ద, పెద్దగా ఏవో మంత్రాలు చదివాడు. తరువాత పోరగాళ్ళని ఒక్కొక్కరినే రమ్మన్నాడు.

ఒక్కొక్కరూ వెళ్ళి "నన్ను మనువాడతావా?" అంటూ వరాలు భుజం మీద చెయ్యివెయ్యడం, ఆమె వారి చేతుల్ని తోసేయడం జరుగుతోంది. ఇలా చేతులు తోసివేయబడ్డవారంతా నిరాశగా వెళ్ళిపోతున్నారు.

సింగడి వంతు వచ్చింది. సింగడికి గుండె గుబగుబ లాడింది. గబగబా వెళ్ళాడు. చెయ్యి వణుకుతోంది. మెల్లగా వరాలు భుజం మీద చెయ్యి వేసి "నన్ను మనువాడతావా?" అడిగాడు.

వరాలు సింగడి కళ్ళల్లోకి చూసి అడిగింది 'కుత్తిగంటు' వేయిస్తావా?

"అలాగే!" అన్నాడు సింగడు ఆతృతగా.

"కుత్తిగంటు వేయించేవరకు నాకు దూరంగా ఉండాల, ఒప్పుకుంటావా?" అడిగింది వరాలు.

"అలాగే!" వెంటనే అన్నాడు సింగడు.

అంతే! అతని చేతిని ముద్దుపెట్టుకుంది వరాలు.

వెంటనే మోగాయి డప్పులు "ధమ, ధమ, ధమ, ధమ"

పెద్దలంతా యిప్పసారా ఉంచిన కుండలపై ఎగబడ్డారు.

అలా వాళ్ళ మనువు జరిగిన తీరు నాకు తెలిసినప్పటికీ, మూడు నెలల వరకు సింగడు నాకు కనిపించలేదు. కాని ఒకనాడు నాకు అనుకోకుండా కనిపించాడు. బాగా చిక్కిపోయాడు.

"ఏరా! మనువు జరిగాక కనిపించలేదు" అడిగాన్నేను.

"ఏమీ లేద్దొరా! వరాలు కోర్కెతీర్చడం కోసం పగలు, రాత్రీ కూడా కుంకుళ్ళు, చింతపండు, పుట్టతేనె సేకరిస్తున్నాను"

జాలి వేసింది నాకు.

"పోనీ ఒక పని చెయ్యరాదూ!" అన్నాన్నేను.

"ఏంటిదొరా?"

నేను సొమ్ము అప్పుగా ఇస్తాను. దానితో కుత్తిగంటు కొను. తరువాత నాకు తీరుద్దూగాని.

"వద్దు దొరా! నేనే గడించికొనాల. అప్పు చేసి కొన్నావని తెలిస్తే వరాలు నన్ను అసయ్యించుకుంటుంది."

"అయితే, అంత వరకూ..." ఆగేన్నేను.

"అవును దొరా! దూరంగానే ఉంటాం!"

ఆశ్చర్యపోయాన్నేను. వాళ్ళ పట్టుదలకు, నిజాయితీకి, నిష్కల్మషమైన ప్రేమకు.

"వస్తాను దొరా!" అంటూ... వెళ్ళిపోయాడు సింగడు.

తరువాత చాలా రోజుల వరకు కనబడ్లేదు సింగడు. వాకబు చేస్తే, అడవులెంట తిరిగి చాలా కష్టపడుతున్నాడని ఆరోగ్యం చెడిందని.

సుమారు సంవత్సరన్నర తరువాత వచ్చారు సింగడు, వరాలు.

అప్పుడు చూశాను వరాలు మెళ్ళో 'కుత్తిగంటు'.

"దండాలు దొరా! సాధించాను దొరా! ఇవాళే దీని మెళ్ళో కట్టాను. దీవించండి దొరా!" అన్నాడు సింగడు.

నా హృదయం ఆర్ద్రమయ్యింది. కనులు చిప్పిల్లాయి. ఆనందాశ్రువులతో దీవించాను వారిని.

గాలికి టేబిల్ నోట్సులో కాగితాలు పరపరలాడ్డంతో ఆలోచనలోంచి ఇహంలో కొచ్చాను.

కనుచూపు దూరంలో కన్పిస్తున్న సింగడ్ని, వరాల్ని చూస్తూ అనుకున్నాను. పెళ్ళైన సంవత్సరం తిరక్కుండానే విడాకుల కోసం పరిగెడుతున్న ఈ ఆధునిక ప్రపంచంలో, సమాజానికి దూరంగా, నిష్కల్మషమైన ప్రేమైక జీవులు మీరు. నాగరికత ముసుగులో కుళ్ళును పెంచుకుంటున్న మేము, మీలాంటి అమాయక గిరిజనుల నుంచి కూడా నేర్చుకోవలసి ఉంది. ●

◆◆◆

**పెళ్ళి ముస్తాబు అవుతున్న వరాలు మనసు మరోలా ఆలోచిస్తోంది.**

◆◆◆



## పాత పేర్లతో కొత్తసినిమాలు

'గోవిందా'కు మొదటి నుంచి 'ధర్మేంద్ర' నటించిన పాత సినిమా పేర్లే కలిసొస్తున్నాయి. మొదట్లో ధర్మేంద్ర గోవిందాని కొన్ని పాత్రలకు రికమెండ్ చేసేవాడట. అంతేకాక ధర్మేంద్ర నటించిన 'షోలా ఔర్ షబ్నమ్, ఆంఖే' చిత్రాల పేర్లు గోవిందాకు అదృష్టాన్నిచ్చాయి. ఇప్పుడు ప్రారంభించబోయే కొత్త చిత్రం 'జీవన్ మృత్యు' కూడా ఒకప్పటి ధర్మేంద్ర సినిమాయే!



## 'దివ్య' స్థానంలో 'మమత'

'సాజిద్ నడియాడ్‌వాలా' తన భార్య 'దివ్యభారతి'తో ఒక చిత్రం నిర్మించాలని అన్ని ఏర్పాట్లు చేసుకున్నాడు. ఆమె ఆకస్మిక మరణం కారణంగా దివ్యస్థానంలో ఇతర నటీమణులను కలిస్తే ఒకరు ఎక్కువ పారితోషికం అడిగారు. ఇంకొకరు డేట్స్ లేవన్నారు. చివరికి మమతా కులకర్ణిని ఫైనల్ చేశాడు. ఆ చిత్రం పేరు 'ఆందోళన్' అతని మరో చిత్రం 'వక్త్ హమారా హై'లో కూడా ఆమె హీరోయిన్!